సాక్షి మెదక్



మెదక్, సిద్దిపేట రైల్వేలైన్లను కలపాలి

ఔటర్ రింగ్ రైల్వే ప్రాజెక్టులో మెదక్–సిద్దిపేట లైన్లను కలపాలని మంత్రి హరీశ్‌రావు కోరారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో రైల్వే పెండింగ్ పనుల అంశంపై బుధవారం దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌తో భేటీ అయ్యారు. 8లో



వండర్ కిడ్ 'అరుషి'

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణానికి చెందిన మూడేళ్ల ఐదు నెలల వయసు ఉన్న అరుషి అద్భుత మేధాశక్తితో ఔరా అనిపిస్తోంది. 8లో



సమన్వయంతో పనిచేయాలి

అధికారులు విధిగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు సమాచారం ఇచ్చి సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు మల్లికార్జున్ పాటిల్ అన్నారు. 9లో

న్యూస్‌రీల్

చిరుత సంచరిస్తోంది.. అప్రమత్తంగా ఉండండి

- అటవీశాఖ అధికారి అంజర్

టేక్మాల్(మెదక్): చిరుతపులి సంచరిస్తున్న పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ సెక్షన్ అధికారి అంజర్ తెలిపారు. మండలంలోని చెరువుముందని తండా (సీఎం తండా)లోని యాపరాల గుట్ట ప్రాంతంలో చిరుత పులి సంచరిస్తుందని తెలిపారు. చిరుత ఆనవాల కోసం బుధవారం గుట్ట పరిసర ప్రాంతాల్లో తిరిగినట్లు తెలిపారు. కొన్ని రోజులు పాటు పరిసర ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆయన వెంట బీట్ అధికారి రమేశ్, సర్పంచ్ రంజా నాయక్, ఉపసర్పంచ్ అనిల్ ఉన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- జిల్లా వ్యవసాయాధికారి గోవింద్



మల్కాపూర్‌లో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి గోవింద్

తూప్రాన్: రైతులు సాగు చేసిన పంటలకు తెగుళ్ల నుంచి కాపాడేందుకు ప్రస్తుత తరుణంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మల్కాపూర్‌లో రైతులు సాగు చేసిన వరి, కూరగాయల పంటలను మండల వ్యవసాయాధికారి గంగుమల్లుతో కలిసి పరిశీలించారు. రైతులకు తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకే మందులు పిచికారి చేయాలని సూచించారు. వారి వెంట వ్యవసాయ విస్తీర్ణ అధికారి సింధు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకులాల్లో పార్ట్‌టైం ఉపాధ్యాయులుగా పనిచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తాత్కాలిక పద్ధతిన పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఫిజిక్స్, గణితం, సైన్స్, బయో సైన్స్, ఇంగ్లిష్, సోషల్, బోటనీ, మ్యాథ్స్, కెమిస్ట్రీ సబ్జెక్ట్‌ల్లో బోధించేందుకు పీజీ 50 శాతం మార్కులు, బీఈడీ, టెట్‌లో ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈనెల 13వ తేదీ లోపు మెదక్‌లోని మినీ గురుకులంలో గల (జిల్లా కోర్టు రోడ్డు) ఆర్‌సీఓ కార్యాలయంలో వాటిని సమర్పించాలని సూచించారు. బాలికల గురుకులల్లో మహిళలకు మాత్రమే అర్హత ఉందని తెలిపారు. అభ్యర్థుల ఎంపిక డెమో ఆధారంగా జరుగుతుందని వివరించారు.

ఆకస్మిక నిర్ణయాలు మానుకోవాలి

- ప్రభుత్వానికి టీటీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల విజ్ఞప్తి

మెదక్ కలెక్టరేట్: విపత్కర సెలవుల పట్ల ప్రభుత్వం, విద్యాశాఖ తీసుకుంటున్న ఆకస్మిక, అనాలోచిత నిర్ణయాల వల్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారని టీటీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంగయ్య, వెంకట్ రాం రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ గత నెలలో కురిసిన భారీ వర్షాల సందర్భంగా ముందస్తుగా సెలవు ప్రకటించాల్సిన ప్రభుత్వం.. ఉదయం ఎనిమిదిన్నర గంటలకు ప్రకటించిందని గుర్తు చేశారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులకు గురికావాల్సి వచ్చిందన్నారు. గందరగోళానికి గురి చేయకుండా అకడమిక్ క్యాలెండర్ ప్రకారం విద్యా సంవత్సరాన్ని కొనసాగించాలని కోరారు. మార్పులు అనివార్యమైతే ఆకస్మికంగా కాకుండా ముందస్తు నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.



జలసవ్వడి.. జన సందడి

కొల్చారం మండలం సంగాయిపేట పెద్ద చెరువు జలకళను సంతరించుకుంది. 35 ఏళ్ల తర్వాత ఈ చెరువు పూర్తిస్థాయిలో నిండి అలుగు పారుతోంది. దీంతో జనం తాకిడి పెరిగింది.అలుగుపై ఆడుతూ కేరింతలు కొడుతున్నారు. సెల్ఫీ దిగుతూ సరదాగా గడుపుతున్నారు. కాగా, సర్పంచ్ మానస ఆధ్వర్యంలో గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించారు. - కొల్చారం(నర్సాపూర్)



జలదిగ్బంధంలోనే దుర్గమ్మ

మంజీరా నదికి వరద ప్రవాహం పెరిగింది. బుధవారం ఘనపురం ఆనకట్టపై నుంచి 20 వేల క్యూసెక్కుల వరద దిగువకు ప్రవహిస్తోంది. దీంతో దుర్గమ్మ ఆలయం ముందు నుంచి నిజాంసాగర్ వైపు పరుగులు తీస్తుంది. అమ్మవారి ఆలయం ముందు నుంచి మంజీరా వరదలు ప్రవహిస్తున్నందున జల దిగ్బంధం కొనసాగుతూనే ఉంది. దీంతో రాజ గోపురంలో భక్తులు అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటున్నారు. - పాపన్నపేట(మెదక్)

సమన్వయంతో పనిచేద్దాం

- అంతర్ జిల్లా పోలీసు అధికారుల సమావేశం



సమావేశంలో పాల్గొన్న పోలీసు అధికారులు

హవేళీఘనపూర్(మెదక్) మెదక్ డీఎస్పీ కార్యాలయంలో అంతర్ జిల్లాల సమన్వయ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా రాబోయే ఎన్నికల్లో శాంతిభద్రతల పరిక్షణలో భాగంగా మెదక్, ఎల్లారెడ్డి డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్న ఈ సమావేశంలో ఎన్నికల్లో చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. మెదక్– కామారెడ్డి జిల్లా సరిహద్దులో ఉన్నందున అధికారులు సమన్వయంతో పనిచేయాలి శాంతిభద్రతలో సహకరించుకోవాలనే దాని పైచర్చించినట్లు మెదక్‌రూరల్ ఎస్ఐ అమర్ తెలిపారు.

పాడి రైతుపై శీతకన్ను

పాడి రైతుపై ప్రభుత్వం శీతకన్ను చూపుతోంది. లీటర్‌పై ఇచ్చే రూ.4 ప్రోత్సహకాన్ని ఐదేళ్లుగా నిలిపివేసింది. ఫలితంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రూ.30.96 కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి. అంతేకాకుండా పాడి గేదెలకు కృత్రిమ గర్భధారణ చేసే గోపాలమిత్రలకు సైతం ఏడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. –మెదక్



మెదక్ జిల్లా కేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్రం

- ఐదేళ్లుగా అందని ప్రోత్సాహకం
- ఉమ్మడి జిల్లాలో రూ.30.96 కోట్ల బకాయిలు
- గోపాలమిత్రలకు ఏడు నెలలుగా అందని వేతనం

ఉమ్మడి మెదక్ జిల్లాలో ఆరు వేల మంది పాడి రైతులు ఉన్నారు. వీరి వద్ద ఆవులు (తెల్లవి), పాడి గేదెలు (నల్లవి) మొత్తం 4,35,297 ఉన్నాయి. సిద్దిపేట జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, మెదక్, సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్, జహీరాబాద్‌లో మొత్తం ఆరు పాల శీతలీకరణ కేంద్రాలు ఉన్నాయి. ఇవి విజయ డెయిరీ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. ఈ ఆరు పాల కేంద్రాల్లో నిత్యం 43 వేల లీటర్ల పాలు పోస్తున్నారు. ఇందులో భాగంగా సిద్దిపేట, గజ్వేల్ కేంద్రాల్లో 30 వేల లీటర్లు, మెదక్‌లో 5 వేల లీటర్లు, నారాయణఖేడ్‌లో 5 వేల లీటర్లు, జహీరాబాద్‌లో 3 వేల లీటర్ల చొప్పున నిత్యం చిల్లింగ్ సెంటర్లకు తరలిస్తున్నారు. కాగా పాల నాణ్యత (ఫ్యాట్)ను బట్టి లీటర్ పాలకు రూ.40 నుంచి రూ.60 వరకు పాడి రైతులకు చెల్లిస్తున్నారు. అయితే తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రభుత్వం విజయ డెయిరీ పేరుతో పాలను సేకరించడం ప్రారంభించింది. రైతుకు లీటర్ పాలపై రూ.4 ప్రోత్సాహకం అందిస్తోంది. కానీ 2018 నుంచి డబ్బులు రావడం లేదని పాడిరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిత్యం 43 వేల లీటర్ల పాలకు గాను రోజుకు రూ.1.72 లక్షలు కాగా నెలకు రూ.51.60 లక్షలు అవుతాయి. ఐదేళ్లకు రూ.30.96 కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి. బకాయిలు చెల్లించాలని గత నెలలో పాడిరైతులు హైదరాబాద్‌లోని హెడ్ ఆఫీస్‌ను ముట్టడించారు. అయినా నేటికీ నిధులు విడుదల కాలేదు.

గోపాలమిత్రలకు వేతనాలు కరువు

పాడి గేదెలు, ఆవులకు కృతిమ గర్భధారణ కోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 135 మంది గోపాలమిత్రలను నియమించారు. ఒక్కో గోపాలమిత్రకు 4 నుంచి 6 గ్రామాలను కేటాయించారు. పాడి గేదెలు, ఆవులు ఎదకు రాగానే వీటికి కృతిమ గర్భధారణ చేస్తారు. వీరికి ప్రభుత్వం నెలకు రూ.11,500 వేతనం ఇస్తోంది. అయితే ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి వేతనాలు రావడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి దృష్టికి తీసుకెళ్లాం

పాడిరైతులకు ప్రభుత్వం లీటర్ పాలపై ఇచ్చే రూ.4 ప్రోత్సాహకం ఐదేళ్లుగా రావడం లేదని ఇటీవల మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే డబ్బులు వచ్చేలా చూస్తామని మంత్రి చెప్పారు.

– లక్ష్మారెడ్డి, ఉమ్మడి జిల్లా పాడి గణాభివృద్ధి సంస్థ చైర్మన్

గ్రామ సభల ద్వారానే ఎంపిక

- దళితబంధు లబ్ధిదారుల ఎంపికపై కలెక్టర్ రాజర్షిషా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: గ్రామ సభల ద్వారా దళిత బంధు లబ్ధిదారులను ఎంపిక చేయాలని, విడతల వారీగా దళితులందరికీ ఆర్థిక సాయం అందుతుందని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో నారాయణఖేడ్ నియోజకవర్గం, పెద్దశంకరంపేట, నర్సాపూర్ నియోజక వర్గంలోని వెల్దుర్తి, మాసాయిపేటలకు సంబంధించిన ఎంపీడీవోలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సాపూర్ నియోజకవర్గంలో రెండు మండలాలు పూర్తి చేసి, మిగతా మండలాలు ఎంపిక చేయడానికి సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు ప్రజాప్రతినిధులు, పెద్ద మనుషులతో గ్రామసభలను ఏర్పాటు చేసి లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. గ్రామాలలో కడు పేదరికంలో ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అవకతవకలకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రమేష్, డీఎఫ్ఓ రవి ప్రసాద్, ఎస్సీ కార్పొరేషన్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

నానో యూరియాతో మేలు

- ఇఫ్‌కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి



ఇఫ్‌కో ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

రామాయంపేట(మెదక్): నానో యూరియాతో రైతులకు లబ్ధి చేకూరుతుందని ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రామాయంపేటలో రైతులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొక్కకు 18 రకాల పోషకాలు అవసరం అవుతాయన్నారు. నానో యూరియాలో అన్ని రకాల పోషకాలు సమృద్ధిగా ఉంటాయని పేర్కొన్నారు. చాలా మంది రైతులు అత్యధిక స్థాయిలో ఎరువులు వాడుతూ ఆర్థికంగా నష్టపోవడంతోపాటు పంట దిగుబడి తగ్గుతుందని చెప్పారు. ఇఫ్‌కో ఎరువులతో ఈ సమస్య నుంచి గట్టెక్కవచ్చని పేర్కొన్నారు. ఇఫ్‌కో జనరల్ మేనేజర్ జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సబ్సిడీలతో ప్రతి ఏటా 14 వేల కోట్ల నష్టం ఇఫ్‌కో భరిస్తుందన్నారు. ఈ సందర్భంగా నానో యూరియా వాడకం విషయమై రైతులకు అవగాహన కల్పించారు. ఇఫ్‌కో జిల్లా మేనేజర్ చంద్రబాబు నాయుడు, రామాయంపేట, కల్వకుంట సహకార సంఘాల చైర్మన్లు బాదె చంద్రం, అందె కొండల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు, ఏవో రాజ్‌నారాయణ, సంఘం డైరెక్టర్లు సుధాకర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, నిజాంపేట ఎంపీపీ సిద్దరాం, నరేందర్ పాల్గొన్నారు.

అసంతృప్తులకు సంకేతాలు!

- అభ్యర్థిత్వాలపై అధినేత నిర్ణయం మారదంటూ.. జహీరాబాద్ బీఆర్ఎస్ సమావేశంలో మంత్రి హరీశ్ స్పష్టీకరణ
- క్రమంగా మెత్తబడుతున్న ఆశావహులు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: 'అభ్యర్థిత్వాల విషయంలో పార్టీ నిర్ణయం మారదు. ఈ విషయమై సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయంలో ఎలాంటి మార్పులు ఉండవు. అధినేత ప్రకటించిన అభ్యర్థులందరీ గెలుపు కోసం పార్టీ శ్రేణులంతా కలిసికట్టుగా కృషి చేయాలి' అని హైదరాబాద్‌లోని ఓ రిసార్ట్‌లో ఇటీవల జరిగిన జహీరాబాద్ ముఖ్యనేతల సమావేశంలో గులాబీ పార్టీ శ్రేణులకు మంత్రి హరీశ్‌రావు దిశానిర్దేశం చేశారు. ఇందులో ఆయన వ్యాఖ్యలు ఆయా నియోజకవర్గాల్లోని అసంతృప్త నేతలకు కీలక సంకేతాలిచ్చినట్లయింది. ఎట్టి పరిస్థితుల్లోనూ అభ్యర్థిత్వాలు మారవని స్పష్టం చేసినట్లయింది. వచ్చే ఎన్నికల్లో పార్టీ తరపున పోటీ చేయనున్న అభ్యర్థులను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గత నెల 21న ప్రకటించారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా 115 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన సీఎం ఉమ్మడి మెదక్ జిల్లాలో సిట్టింగ్‌లందరికీ టికెట్ కేటాయించారు. ఒక్క నర్సాపూర్ నియోజకవర్గానికి మాత్రం అభ్యర్థిని ప్రకటించలేదు. ఈ ప్రకటనతో జిల్లాలో కొన్ని చోట్ల అసంతృప్తులు బయటపడ్డారు. పటాన్‌చెరువులో నీలం మధు, సంగారెడ్డిలో పులిమామిడి రాజు, పట్నం మాణిక్యం, జహీరాబాద్‌లో ఢిల్లీ వసంత్ తమ అనుచరులతో సమావేశాలు నిర్వహించారు. అలాగే నర్సాపూర్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి అనుచరులు కాస్త హడావుడి చేశారు. ఈ అసంతృప్త నేతల తీరును పార్టీ అధినాయకత్వం నిశితంగా పరిశీలిస్తూ వచ్చింది. మరోవైపు మంత్రి హరీశ్‌రావు వారిని ఎప్పటికప్పుడూ సముదాయించారు. ఈ నేపథ్యంలో ఇటీవల జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన అభ్యర్థిత్వాల విషయంలో ఎలాంటి మార్పులుండవని స్పష్టం చేశారు. పార్టీ గెలుపు కోసం కష్టపడిన నాయకులందరినీ రానున్న రోజుల్లో తగిన ప్రాధాన్యం ఉంటుందని, ఆయా నియోజకవర్గాల్లో ఆయా నాయకులకు రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవులతో గౌరవించుకున్న విషయాన్ని గుర్తుచేశారు.

చల్లారుతున్న అసంతృప్తి సెగలు

అభ్యర్థిత్వాల ప్రకటనతో అక్కడక్కడ బయటపడ్డ అసంతృప్తి సెగలు క్రమంగా చల్లారుతున్నాయి. అభ్యర్థిత్వాలు ప్రకటించిన వెంటనే నాలుగైదు రోజులు తమ అనుచరులతో హడావుడి చేసిన నేతలు కాస్త వెనక్కి తగ్గుతున్నారనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. కాగా వీరిని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు కాంగ్రెస్, బీజేపీలు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇవి ఏ మేరకు ఫలితాలిస్తాయనేది ఆసక్తికరంగా మారింది.

బోనాలతో నిరసన

- కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల ర్యాలీ



కలెక్టరేట్ ఎదుట బోనాలతో నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగులు

మెదక్ కలెక్టరేట్: తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేసే కాంట్రాక్ట్ ఉద్యోగులు రిలే దీక్షలు చేపట్టారు. బుధవారం కలెక్టరేట్ ప్రధాన గేటు వరకు డప్పుచప్పుళ్లతో బోనాలు తీసుకొచ్చి నిరసన తెలిపారు. అనంతరం గ్రామ దేవతకు బోనాలు సమర్పించారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించేలా కనికరించాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. విద్యాశాఖలో పని చేస్తున్న కేజీబీవీ టీచింగ్ అండ్ నాన్ టీచింగ్, సీఆర్‌పీ, ఎంఎస్ కోఆర్డినేటర్, ఐఆర్పీ, కంప్యూటర్ ఆపరేటర్స్, మెసెంజర్, పీటీఐలు 15 సంవత్సరాలుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

సంపద వనాలతో ఆదాయం ఘనం

- ఎఫ్ఆర్ఓ మనోజ్‌కుమార్



పనులను పరిశీలిస్తున్న మనోజ్‌కుమార్

కౌడిపల్లి(నర్సాపూర్): సంపద వనాలతో గ్రామాల్లో ఆదాయం పెరుగుతోందని ఎఫ్ఆర్ఓ మనోజ్‌కుమార్ అన్నారు. మండలంలోని కొట్టాల పంచాయతీ లింగంపల్లి అబ్బాయకుంటలో మూడెకరాల స్థలంలో జరుగుతున్న పనులను ఆయన, ఉపాధిహామీ అధికారులు బుధవారం పరిశీలించారు. ఆపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు 1,100 గుంతలు తీసినట్లు ఏపీఓ పుణ్యదాస్ తెలిపారు. వీటిలో వేప, అల్లనేరేడు, వెదురు, చీమచింత తదితర 800 మొక్కలు తెచ్చినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంపద వనాల్లో నాటిన ప్రతి మొక్కనూ రక్షించాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ నరహరి, డిప్యూటీ ఎఫ్ఆర్ఓ రాజమణి, ఏపీఓ పుణ్యదాస్, ఈసీ ప్రేమ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి మల్లేశం, టీఏ జ్యోతి, ఫీల్డ్ అసిస్టెంట్ అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి నిరూపిస్తాం

- ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డికి అసమ్మతి వర్గం సవాల్

మెదక్ మున్సిపాలిటీ: మీ అవినీతిని నిరూపించడానికి సిద్ధమని బీఆర్ఎస్ అసమ్మతి వర్గ నాయకులు అన్నారు. 'పసుపు బట్టలతో వనదుర్గా మాత వద్దకు వస్తాం..మీరూ రావాలని'సవాల్ విసిరారు. బుధవారం చిన్నశంకరంపేట సర్పంచ్ రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నరేందర్, నాయకులు జీవన్‌రావు విలేకరులతో మాట్లాడారు. దేవేందర్‌రెడ్డి ఆయన అనుచరులు చేసిన భూకబ్జాలు, అవినీతి అక్రమాలు నిజమేనని నిరూపిస్తామన్నారు. చిన్న శంకరంపేట జెడ్పీటీసీ మాధవి భర్త రాజు భూకుంభకోణాలను ఆధారాలతో సహా ఇస్తామన్నారు. దేవేందర్‌రెడ్డికి రూ.20 కోట్ల ఇల్లు, వందల ఎకరాల భూములు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. కోనపూర్ సొసైటీలో అవినీతి జరిగిందని ఫిర్యాదు రావడంతోనే చైర్మన్ పదవి నుంచి తొలగించిన విషయాన్ని గుర్తుచేశారు. ఓ వ్యాపారి వద్ద డబ్బులు తీసుకొని మున్సిపల్ చైర్మన్ పదవి కట్టబెట్టారని కట్టబెట్టారని ఆరోపించారు. ఏడుపాయల ఈఓ బంగారం కొల్లగొట్టేందుకు చేసిన కుట్రలో మీ వాటా లేదా? అని ప్రశ్నించారు. జోనల్ ట్రాన్స్‌ఫర్‌లో వెళ్లాల్సిన ఈఓను ఇక్కడే ఉంచడంలో అంతర్యమేమిటో సమాధానం ఇవ్వాలన్నారు.



రండి.. తేల్చుకుందాం

- సవాల్ స్వీకరించిన ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: రాజకీయంగా ఎదుర్కోలేక తనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ నేత, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ అసమ్మతి నాయకులు బుధ వారం చేసిన సవాల్‌ను ఆయన స్వీకరించారు. ఏడుపాయల్లో అమ్మవారి ముందే తేల్చుకుందాం రండి అని దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే పద్మా రెడ్డి కృషి ఫలితంగా నియోజకవర్గంతో పాటు ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఏడుపాయల ఈవో అక్రమాలకు పాల్పడితే తనకేమి సంబంధం అని ప్రశ్నించారు. అధికారులను సమన్వయం చేస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న తనపై అనవసరమైన ఆరోపణలు చేస్తూ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు అక్రమాలకు పాల్పడితే సంబంధిత శాఖ అధికారులు విచారణ చేపట్టి, శాఖాపరంగా తగు చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు. వన దుర్గామాత ఆలయం వద్ద తడి బట్టలతో ప్రమాణం చేసేందుకు సిద్ధమని పునరుద్ఘాటించారు. తనపై ఆరోపణలు చేసిన వారు గురువారం ఉదయం 8గంటలకు ఏడుపాయలకు రావాలని దేవేందర్ రెడ్డి సవాల్ విసిరారు.

విద్యావ్యవస్థ నిర్వీర్యం : ఏబీవీపీ

కొండాపూర్(సంగారెడ్డి): ప్రభుత్వం విద్యావ్యవస్థను విధ్వంసం చేస్తున్నదని ఏబీవీపీ అఖిల భారత సహా సంఘటన కార్యదర్శి బాలకృష్ణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కమల్ సురేశ్ విమర్శించారు. బుధవారం సంగారెడ్డిలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగే రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తొమ్మిదేళ్లుగా విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తూ ఈ వ్యవస్థను అధోగతి పాలు చేస్తోందని మండిపడ్డారు. నాలుగు లక్షల మంది టెట్ అభ్యర్థులుండగా, సుమారు 7 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ వేశారని దుయ్యబట్టారు. ఇటీవల చంద్రయాన్ 3 ద్వారా ఇస్రో చరిత్రను తిరగరాసిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి, ప్రాంత సంఘటన మంత్రి కరుణాకర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సహజ కూరగాయ విత్తనాలపై అవగాహన

నిజాంపేట(మెదక్): సహజ కూరగాయ విత్తనాలపై తెలంగాణ డెవలమెంట్ ఫ్రోమ్ జైకిసాన్ చైర్మన్ నరేందర్‌రెడ్డి అవగాహన కల్పించారు. బుధవారం నిజాంపేట మండల కేంద్రంలోని 12 గ్రామాల రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తినే ఆహారంలో రసాయనాలు కలవడంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. కావున రైతులు సహజ ఎరువులు, విత్తనాల వాడకం వైపు మొగ్గు చూపాలన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే వేటే

తూప్రాన్: రోగులకు 24 గంటల పాటు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆయుర్వేద వరంగల్ రేంజ్ డిప్యూటీ డైరెక్టర్ రవినాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రికార్డులను, ఓపీ, రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల ఆరోగ్య సమస్యలు, వారికి ఏ రకమైన చికిత్సతో పాటు మందుల వివరాలను సిబ్బందితో చర్చించారు. రోగుల పట్ల నిర్లక్ష్యం వ్యవహరించకూడదని వారికి నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు రాత్రి వేళల్లో అందుబాటులో లేని వైద్యులు, సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా ఆసుపత్రికి సంబంధించిన బోరుబావి చెడిపోయి 15 రోజులు కావస్తున్నా సిబ్బంది చర్యలు చేపట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటికప్పుడు బోరుబావి మోటరును మరమ్మతు చేయించారు.

పారదర్శకంగా ప్రమోషన్లు ఇవ్వాలి


వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

మెదక్ కలెక్టరేట్: టీటీసీ, డీఎడ్ పూర్తిచేసిన ఎస్జీటీ ఉపాధ్యాయులకే ప్రమోషన్ ఇవ్వాలని ఎస్టీయూటీఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మెదక్ కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల ప్రమోషన్లు పారదర్శకంగా నిర్వహించేలా చూడాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఎస్జీటీ పోస్టుకు టీటీసీ, డీఈడీ పూర్తి చేసిన వారు మాత్రమే అర్హులని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రణీద్‌కుమార్, రాజగోపాల్‌గౌడ్, దుర్గరాములు, అరుణ్‌కుమార్, బాలమల్లేష్ పాల్గొన్నారు.

అలుగులు పారుతున్న చెరువులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కొట్టాల పెద్ద చెరువు 34ఏళ్ల తరువాత అలుగు పారుతుంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో బుధవారం ఉదయం నుంచి అలుగు పారుతుంది. దీంతో సర్పంచ్ నర్సహరి గ్రామస్తులు గంగమ్మతల్లికి పూజలు చేశారు. అదేవిధంగా వెల్మకన్న చెరువు అలుగుపారడంతో రోడ్డుపైనుంచి నీరు ప్రవహిస్తుంది.

కొండరెడ్డికుంట చెరువు..

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలోని కొండరెడ్డి కుంట చెరువు 30 ఏళ్ల అనంతరం జలకళను సంతరించుకొని అలుగు పారుతోంది. దీంతో అలుగు పారడాన్ని చూసేందుకు గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. యువకులు అలుగు వద్ద సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.

ఎన్నికలకు సహకరించండి

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని మత్స్యసహకార సంఘాల ఎన్నికలకు అన్ని సంఘాలు సహకరించాలని జిల్లా మత్స్యశాఖ అధికారిణి రజిని సూచించారు. బుధవారం మెదక్ కలెక్టరేట్‌లో మత్స్య సహకార సంఘాల ఎన్నిలకు సంబంధించి దరఖాస్తులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొన్ని సంఘాల్లో సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించడంతోపాటు త్వరలోనే సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి సంఘాల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మూడు దరఖాస్తులు మాత్రమే వచ్చినట్లు తెలిపారు. సంఘాలకు ఎన్నికల మార్గదర్శకాలను నిర్దేశించినట్లు చెప్పారు.

వండర్ కిడ్ 'అరుషి'

- అద్భుత జ్ఞాపక శక్తితో అబ్బురపరుస్తున్న చిన్నారి
- 195 దేశాల రాజధానుల పేర్లు 5.5 నిమిషాల్లో చెప్పి రికార్డ్
- గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు

హుస్నాబాద్: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణానికి చెందిన మూడేళ్ల ఐదు నెలల వయసు ఉన్న అరుషి తన అద్భుత మేధాశక్తితో ఔరా అనిపిస్తుంది. బుడిబుడి అడుగులు వేస్తూ, ముద్దులొలికించే మాటలతో బుజ్జిగా కనిపించే చిన్నారి అరుషి ప్రపంచంలోని 195 దేశాల రాజధానుల పేర్లను 5 నిమిషాల 5 సెకన్ల సమయంలోనే చకాచకా చెప్పి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించింది.

పట్టణానికి చెందిన సురేశ్, కావ్య దంపతులకు ఇద్దరు కూతుళ్లు అరోహి గౌడ, అరుషి గౌడ ఉన్నారు. తండ్రి బేకరీ షాపు నిర్వహిస్తుంటాడు. తల్లి కావ్య ఇంటి వద్ద ఉంటుంది. ఈ ఇద్దరు చిన్నారులు మేథస్సులో దిట్ట. చిన్న పాప అరుషి గౌడ పట్టణంలో ఓ ప్రైవేట్ స్కూల్‌లో నర్సరీ చదువుతోంది. అరుషి జ్ఞాపక శక్తిని గుర్తించిన తల్లి ఏదో ఒక అంశంలో ఇండియా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించాలని సంకల్పించింది.

ప్రతీరోజు 5 దేశాల రాజధానులపై శిక్షణ

చిన్నారి అరుషిగౌడకు తల్లి కావ్య ప్రతీ రోజు ఐదు దేశాలకు సంబంధించిన రాజధానుల పేర్ల గురించి ఆడుకునే సమయంలో, అన్నం తినేటప్పుడు ప్రాక్టీస్ చేయించేది. నెలన్నరలో 195 దేశాల రాజధానుల పేర్లు అతి తక్కువ సమయంలో సునాయసంగా చెప్పేలా కంఠస్తం చేయించింది. ఇండియా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో ఎలా పార్టిసిపేట్ చేయాలో ఆ ప్రొసీజర్‌ను యూట్యూబ్ ద్వారా తెలుసుకుంది. వెంటనే మూడేళ్ల 5 నెలల అరుషిగౌడతో



ఇండియా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు పుస్తకం

195 దేశాల రాజధానుల పేర్లు 5 నిమిషాల 5 సెకన్లలో చెప్పేలా ఆన్‌లైన్ యాప్ ద్వారా వీడియోను చిత్రీకరించి రికార్డు చేసింది. ఆ వీడియోను ఢిల్లీలోని ఇండియా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డుకు జూలై 31న పంపించారు. ఢిల్లీ కార్యాలయంలో ముగ్గురు జడ్జిల సమక్షంలో ఆ వీడియోను పరిశీలించారు. అరుషిగౌడ ప్రతిభకు గిన్నిస్ బుక్‌లో చోటు దక్కినట్లు చీఫ్ ఎడిటర్ డాక్టర్ బైస్వారూప్ రాయ్ చౌదరి ఆగస్టు 7న ప్రకటించారు. ఈ విషయాన్ని ఫోన్, మెయిల్ ద్వారా చిన్నారి తల్లిదండ్రులకు తెలియజేశారు. ఇటీవల ఇండియా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు (2023) పుస్తకం, మెడల్, ప్రశంసా పత్రాలను అరుషి గౌడ తల్లిదండ్రుల అడ్రస్‌కు పోస్ట్ ద్వారా పంపించారు.

పెద్ద కూతురు కూడా..

సురేష్, కావ్య దంపతుల పెద్దకూతురు అరోహిగౌడ సైతం మేథస్సులో దిట్ట. ఆ చిన్నారి సైతం 2021లో మూడెళ్ల 9 నెలల వయస్సులో ప్రపంచంలోని 195 దేశాల రాజధానుల పేర్లను 5 నిమిషాల 30 సెకన్లలో చెప్పి ఇండియన్ గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సాధించింది. అలాగే భారత దేశంలోని 28 రాష్ట్రాల పేర్లను 1 నిమిషం, 28 సెకండ్లు, ఫ్రీడమ్ ఫైటర్ల పేర్లను 4 నిమిషాల్లో చెప్పి గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించింది.


అరుషి గౌడ



ప్రశంసా పత్రం

టాలెంట్ ఉంటే ఏదైనా సాధించవచ్చు



పిల్లల్లో ఏదో ఒక టాలెంట్ ఉంటుంది. దానిని గుర్తిస్తే ఏదైనా సాధించగలుగుతారు. మాకు ఇద్దరు ఆడపిల్లలని ఏనాడూ బాధపడలేదు. వీరిద్దరూ ఇండియా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సాధించడం సంతోషంగా ఉంది.

– సురేష్, కావ్య దంపతుల, హుస్నాబాద్

మంత్రి హరీశ్‌రావు అభినందన

అరుషి గిన్నిస్ బుక్‌లో స్థానం పొందడం పట్ల ఈ నెల 4న రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు, హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్ కుమార్‌లు అరుషిగౌడను అభినందించి సన్మానించారు. భవిష్యత్‌లో ఇంకా ఎన్నో మెడల్స్‌ను గెలుచుకోవాలని వారు ఆకాంక్షించారు.



మెదక్, సిద్దిపేట రైల్వేలైన్లను కలపాలి


దక్షిణ మధ్య జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ కలిసిన మంత్రి హరీశ్‌రావు

మెదక్/సిద్దిపేట జోన్: ఔటర్ రింగ్ రైల్వే ప్రాజెక్టులో మెదక్–సిద్దిపేట లైన్లను కలపాలని మంత్రి హరీశ్‌రావు కోరారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో రైల్వే పెండింగ్ పనుల అంశంపై బుధవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. సిద్దిపేట నుంచి తిరుపతి, బెంగళూర్ వంటి నగరాలను రైళ్లను ప్రారంభించాలని కోరారు. అలాగే హైదరాబాద్ నుంచి సిద్దిపేటకు పుష్పుల్ ప్యాసింజర్ రైళ్లను నడపాలని కోరారు. కొత్తగా నిర్మించిన సిద్దిపేట రైల్వేలైను ఈనెల 15న, రైల్వే సేఫ్టీ కమిషనర్ పరిశీలించనున్నారని, అదిపూర్తి కాగానే ప్యాసింజర్ రైళ్లను ప్రారంభించాలని మంత్రి కోరారు. కొమురవెల్లి మల్లన్న ఆలయం వద్ద కొత్త రైల్వేస్టేషన్ పనులతో పాటు మెదక్ జిల్లా మాసాయిపేటలో రైల్వే పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విన్నవించారు. దేశచరిత్రలోనే సిద్దిపేట రైల్వేలైన్ నిర్మాణం అత్యంత వేగంగా పూర్తి అయిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ వేగంగా చేయటంతోనే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. తెలంగాణలో నిర్మించనున్న ఔటర్‌రింగ్ రోడ్డు ప్రాజెక్టులో మెదక్, సిద్దిపేటలను కలపాలని సూచించారు. పెరుగుతున్న జనాభా అవసరాలను దృష్టిలో పెట్టుకుని మెదక్, సిద్దిపేట మీదుగా ఔటర్‌రింగ్ రైల్వేలైన్ నిర్మించాలని మంత్రి కోరారు. రూ.250 కోట్లతో 2 వేల ఎకరాల భూసేకరణ చేసి రాష్ట్ర ప్రభుత్వం రైల్వేశాఖకు అప్పగించటం జరిగిందని మంత్రి చెప్పారు. ఆయనతో పాటు ఎంపీ ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు. మంత్రి వినతిపై దక్షణమధ్య జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ సానుకూలంగా స్పందించారు.

జహీరాబాద్–తాండూర్‌ల మధ్య కొత్త రైల్వే లైన్

జహీరాబాద్: సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్ నుంచి వికారాబాద్ జిల్లాలోని తాండూర్‌ల మధ్య కొత్త రైల్వేలైన్‌కు ఎఫ్ఎల్ఎస్ మంజూరి అయ్యింది. ఇందుకోసం రూ.1,350 కోట్ల మేర నిధులు అవస రం అవుతాయని అంచనా వేసింది. రైల్వే లైన్ నిర్మా ణం పూర్తయి వినియోగంలోకి వస్తే జహీరాబాద్–తాండూర్‌ల మధ్య దూరం 65 కిలో మీటర్లు తగ్గనుంది. ప్రస్తుతం జహీరాబాద్ నుంచి వికారాబాద్ మీదుగా తాండూర్‌కు రైళ్ల రాకపోకలు సాగిస్తున్నా యి. దీంతో ప్రయాణికులకు అదనపు దూర ప్రయా ణం తప్పడం లేదు. రైల్వే మంత్రిత్వ శాఖ రైళ్ల అను సంధానాన్ని బలోపేతం చేసేందుకు దృష్టి సారించింది. రాష్ట్రంలో దాదాపు 15 కొత్త రైల్వేలైన్ల కోసం ఫైనల్ లొకేషన్ సర్వే(ఎఫ్ఎల్ఎస్)ను మంజూరు చేసింది. అందులో భాగంగానే జహీరాబాద్ నుంచి తాండూర్‌లోని సిమెంట్ క్లస్టర్ల వరకు లైను నిర్మా ణం చేపట్టనున్నారు. ఆయా ప్రాంతాల మధ్య 75 కిలోమీటర్ల మేర నిర్మాణం చేపట్టాల్సి ఉంటుందని రైల్వే శాఖ అధికార వర్గాలు పేర్కొన్నాయి. తాండూ ర్ ప్రాంతంలో ఉన్న సిమెంటు కర్మాగారాలకు సైతం రైల్వే లైన్ ఉపయోగపడనుంది. అంతే కాకుండా ఆయా ప్రాంతాలకు ప్రయాణికులు రాక పోకలు సాగించేందుకు ఎంతో సౌకర్యంగా మార నుంది. ప్రస్తుతం రైలు, బస్సు సదుపాయాలు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రాజెక్టు పూర్తయితే ఇరు ప్రాంతాల మధ్య మరింత అభివృద్ధి జరగనుంది.

పార్ట్‌టైంజాబ్ పేరిట సైబర్ వల

రూ.30 లక్షలు పోగొట్టుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: పార్ట్‌టైం జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.30 లక్షలు పోగొట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సింఫోని కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి ఆగస్టు 17వ తేదీన పార్ట్‌టైం జాబ్ అంటూ తన వాట్సాప్‌కు మెసేజ్ వచ్చింది. దానికి స్పందించిన ఉద్యోగి అందులో తన వివరాలను నమోదు చేశాడు. దీంతో సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడీ క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఉద్యోగి ముందుగా రూ.9 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు పూర్తి చేయడం మొదలుపెట్టాడు. ఇలా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు పలు దఫాలుగా మొత్తం రూ.30 లక్షలు చెల్లించాడు. సైబర్ నేరగాళ్లు ఉద్యోగితో నగదు పెట్టిస్తూ తనకు ఇచ్చిన వాలెట్‌లో నగదుతోపాటు కమీషన్ నగదు చూపిస్తూ వచ్చారు. దీంతో ఉద్యోగి చివరిగా తాను పెట్టిన నగదుతోపాటు కమీషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం బుధవారం పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ వలలో రైతు...

ఓ రైతు సైబర్ వలలో చిక్కుకొని రూ. లక్షా 96



వేలు పోగొట్టుకున్న సంఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సిఐ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాలు. పటాన్‌చెరు మండలం కర్దనూరు గ్రామానికి చెందిన ఓ రైతు ఆగస్టు 25వ తేదీన తన వ్యవసాయ పొలంలో పని చేసేందుకు వచ్చిన కూలీలకు ఫుడ్ ఆర్డర్ చేశాడు. ఆర్డర్ తీసుకున్న అనంతరం వ్యవసాయ పొలంలోకి ఫుడ్ డెలివరీ చేయడం సాధ్యం కాదని చెప్పారు. రైతు ఆర్డర్‌ని క్యాన్సల్ చేశారు. రైతు ఆన్‌లైన్ ఫుడ్ కోసం నగదు కట్టడంతో వాటిని వెనక్కు రప్పించేందుకు గూగుల్‌లో టోల్ ఫ్రీ నెంబర్ కోసం శోధిస్తుండగా ఓ నెంబర్ దొరికింది. బాధితుడు ఆ నెంబర్‌కి ఫోన్ చేశాడు. వారు చెప్పిన విధంగా చేయడంతో రైతు ఖాతాలో ఉన్న రూ.లక్షా 96 వేలు సైబర్ నేరగాళ్లు కాజేశారు. దీంతో మోసపోయినట్లు గుర్తించిన రైతు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం బుధవారం బీడీఎల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గౌరవెల్లి ప్రాజెక్టులోకి దూసుకెళ్లిన లారీ

అక్కన్నపేట(హుస్నాబాద్): ఓ లారీ మంగళవారం అర్ధరాత్రి గౌరవెల్లి ప్రాజెక్టులోకి దూసుకెళ్లింది. స్థానికులు తెలిపిన వివరాలు. మండలంలోని రామవరం గ్రామం మీదుగా హుస్నాబాద్‌కు వెళ్లాల్సిన లారీ నందారం స్టేజీ వద్ద మూలమలుపు వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో నేరుగా వెళ్లింది. దీంతో లారీ ప్రాజెక్టు నీటిలోకి దూసుకెళ్లింది. క్యాబిన్ వరకు నీరు వచ్చేసరికి అక్కడే ఆగిపోయింది. దీంతో రాత్రి అంతా ఇద్దరు డ్రైవర్లు, క్లీనర్ లారీలోనే ఉండిపోయారు. మరుసటి రోజు బుధవారం ఉదయం నీళ్లలో ఈదుకుంటూ బయటకు వచ్చారు. జేసీబీ సహాయంతో లారీని బయటకు తీశారు. డ్రైవర్లు, క్లీనర్‌ది తమిళనాడు రాష్ట్రంగా గుర్తించారు. చేర్యాల, మద్దూరు మండలాల్లో తమిళనాడు నుంచి లారీలో తీసుకోవచ్చిన లోడ్‌ను దించి తిరిగి వెళ్లుతున్న క్రమంలో ఈ సంఘటన చోటుచేసుకున్నట్లు వారు చెబుతున్నారు.


గౌరవెల్లి ప్రాజెక్టులో దూసుకెళ్లిన లారీ

ఆటోను ఢీ కొట్టిన వ్యాన్

పదేళ్ల చిన్నారి మృతి


చిన్నారి శృతి మృతదేహం

కొల్చారం(నర్సాపూర్): ఎదురుగా వస్తున్న ఆటోను ఏటీఎం క్యాష్ వ్యాన్ ఢీ కొట్టడంతో ఓ చిన్నారి మృత్యువాత పడగా, తల్లిదండ్రులకు తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ మహమ్మద్ గౌస్ తెలిపిన వివరాలు. కామారెడ్డి జిల్లా అడవి లింగాల గ్రామానికి చెందిన సంతోష్, అతని భార్య సునీత, కూతురు శృతి(10)తో కలిసి ఆటోలో హైదరాబాద్ వైపు వెళ్తున్నారు. కొల్చారం మండల పరిధి లోతువాగు మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఏటీఎం క్యాష్ వ్యాన్ ఆటోను ఢీ కొట్టింది. ప్రమాదంలో ఆటోలో ఉన్న భార్యాభర్తలకు స్వల్ప గాయాలయ్యాయి. వారి కూతురికి తల వెనకభాగంలో తీవ్ర గాయం కావడంతో మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స చేస్తుండగా చిన్నారి చనిపోయింది. మృతురాలి తండ్రి సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కారును వెనుక నుంచి ఢీకొట్టిన బైక్ ఇద్దరికి గాయాలు


క్షతగాత్రున్ని అంబులెన్సులో తరలిస్తున్న సిబ్బంది

కొండపాక(గజ్వేల్): కారును వెనుక నుంచి బైక్ ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన రాజీవ్ రహదారిపై దుద్దెడ గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని బందారం గ్రామానికి చెందిన జాప వరుణ్, దండుగుల ప్రశాంత్ ద్విచక్ర వాహనంపై సిద్దిపేటకు వెళ్తున్నారు. అదేదారిలో కొండపాకకు చెందిన ఎర్రబోయిన శ్రీశైలం కారులో వెళ్తూ సడన్‌గా బ్రేక్ వేశాడు. దీంతో యువకులు వస్తున్న బైక్ వెనుక నుంచి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వరుణ్‌కు తీవ్ర గాయాలు కాగా, ప్రశాంత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వారిని 108 అంబులెన్సులో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రజకులకు టికెట్ కేటాయించకపోవడం దారుణం

పటాన్‌చెరు టౌన్: చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ఐక్యంగా ముందుకు సాగుతామని, 30లక్షల జనాభా ఉన్న రజకులకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క టికెట్ కేటాయించకపోవడం దారుణమని రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి చాకలి వెంకటేష్ అన్నారు. మండల పరిధి ఇస్నాపూర్ చౌరస్తాలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నియోజకవర్గ స్థాయి రజకుల ఐక్యవేదిక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పటాన్‌చెరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా తృటిలో అవకాశం కోల్పోయిన


మాట్లాడుతున్న చాకలి వెంకటేష్

నీలం మధు ముదిరాజ్‌కు సబ్బండ వర్గాల ప్రజల మద్దతు రోజురోజుకూ పెరుగుతుందన్నారు. బీసీ వర్గాలు ఐకమత్యంతో ముందుకు సాగి నీలం మధును ఎమ్మెల్యేగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే టికెట్ నీలం కు టికెట్ కేటాయిస్తే గెలిపించి బహుమతిగా ఇస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం టికెట్ కేటాయించని పక్షంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో నిలిపి గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రజక సంఘం మండల అధ్యక్షులు గణేష్, వీరేష్, నాగేష్, నరసింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య, లక్ష్మణ్, ఆశయ్య, రవి, సందీప్, గోపాల్, నారాయణ, సురేశ్, బాలకృష్ణ పాల్గొన్నారు.

నేడు నెట్‌బాల్ పోటీలకు ఎంపిక

గజ్వేల్‌రూరల్: నెట్‌బాల్ పోటీలకు సీనియర్ మహిళ, పురుషుల విభాగంలో గురువారం క్రీడాకారుల ఎంపిక చేపట్టనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డానియల్, ఉపాధ్యక్షులు విజయరేఖ, సెక్రటరీ రంజిత్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ పట్టణంలోని సేయింట్ పీటర్స్ హైస్కూల్ ఆవరణలో జిల్లాస్థాయి నెట్ బాల్ జట్టు ఎంపిక జరుగుతుందన్నారు. ఆసక్తిగల వారు ఆధార్‌కార్డు, 2 పాస్‌ఫోటోలతో ఉదయం 9గంటలకు హాజరు కావాలని సూచించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 9 నుంచి 11వరకు నిర్మల్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలలో పాల్గొంటారని, మరిన్ని వివరాలకు 9704611361 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

వసతి కల్పించండి


అనాథ పిల్లలను అప్పగిస్తున్న న్యాయమూర్తి

నర్సాపూర్‌రూరల్: అనాథ చిన్నారులకు విద్యతో పాటు వసతి కల్పించాలని న్యాయమూర్తి అనిత స్థానిక ఎంఈఓ, హాస్టల్ వార్డెన్‌ను బుధవారం ఆదేశించారు. పట్టణానికి చెందిన వడ్డె యాదగిరి బస్సు ప్రమాదంలో మృతి చెందగా అతని భార్య దుర్గమ్మ క్యాన్సర్‌తో బాధ పడుతుంది. మెరుగైన వైద్యం కోసం ఆమె ముంబై వెళ్లాలని వైద్యులు సూచించారు. దీంతో వారి పిల్లలైన కీర్తన, నందిని అనాథలుగా మిగిలారు. మా పిల్లలకు చదువుతో పాటు వసతి కల్పించాలని మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ జూనియర్ సివిల్ జడ్జ్ అనితను బాధితులు బుధవారం ఆశ్రయించారు. తక్షణమే స్పందించిన న్యాయమూర్తి.. నర్సాపూర్ ఎంఈఓ బుచ్యా నాయక్‌ను నర్సాపూర్ కోర్టుకు పిలిపించారు. వారికి మెరుగైన విద్యతోపాటు మంచి వసతి కల్పించాలని సూచించారు. నర్సాపూర్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ద్వారా చిన్నారి అనాథ ఆడపిల్లలను ఎంఈఓకు అప్పగించారు. చిన్నారి ఆడపిల్లలను కోర్టు ఆదేశాల ప్రకారం హాస్టల్లో చేర్పించారు.

నీటి గుంతలో పడి వ్యక్తి మృతి



జిన్నారం: వర్షాల కారణంగా నిల్వ ఉన్న నీటిలో పడి ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన జిన్నారం మండలంలోని ఖాజీపల్లి గ్రామంలో బుధవారం జరిగింది. సీఐ నయీముద్దీన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఖాజీపల్లి గ్రామ శివారులోని ఓఆర్ఆర్ సర్వీస్‌రోడ్డుపై ఉన్న మూడు అడుగుల నీటి గుంతలో సుమారు 45 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి పడి మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చెరుకొని గుంతలో నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుని వద్ద ఉన్న ఫోన్ స్విచ్‌ఆఫ్ కావడంతో వివరాలు తెలియరాలేదు. ఎవరికైనా వివరాలు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు. మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

గోడకూలి వృద్ధురాలి..

సంగారెడ్డి టౌన్: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గోడ కూలి ఓ వృద్ధురాలు మృతిచెందిన సంఘటన మంగళవారం సంగారెడ్డి మండలం కులబ్ గుర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోచమ్మ (75) కూన పెంకలతో కూడిన ఇంట్లో నివాసం ఉంటుంది. భారీ వర్షాలకు పదునెక్కిన గోడ ఒక్కసారిగా పోచమ్మపై కూలడంతో అక్కడికక్కడే మృతి చెందింది.

కుంటలో గల్లంతు

శివ్వంపేట(నర్సాపూర్): చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి గల్లంతైన సంఘటన మండల పరిధి గుండ్లపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన విభూతి యాదగిరి మంగళవారం ఇంటి నుంచి వెళ్లి రాత్రి వరకు రాలేదు. కుటుంబ సభ్యులు వెతకగా స్థానిక పంబన్న కుంట కట్టపై యాదగిరికి సంబంధించిన దుస్తులు, చెప్పులు కనిపించాయి. చేపలు పట్టేందుకు కుంటలోకి దిగి గల్లంతైనట్లు గుర్తించారు. గజ ఈతగాళ్ల సాయంతో కుంటలో వెతికినా అతని ఆచూకీ లభించలేదు.


యాదగిరి (ఫైల్)

ఉరి వేసుకుని ఇద్దరు మృతి

జహీరాబాద్ టౌన్: మండలంలోని సత్వార్ గ్రామానికి చెందిన ఓ యువకుడు బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చిరాగ్‌పల్లి ఎస్ఐ నరేష్ వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మ్యాతరి నాగప్పకు మోజెస్(25) వ్యవసాయ కూలీ పనులు చేస్తుంటాడు. మోజెస్‌కు ఇటీవలె న్యాల్‌కల్ మండలంలోని మల్గి గ్రామానికి చెందిన యువతితో పెళ్లి అయింది. తల్లిదండ్రులు లేని కారణంగా బంధువులు ఆయన వివాహం ఘనంగా నిర్వహించారు. భార్యను పుట్టింటికి పంపిన మోజెస్ ఇంటిలో ఎవరులేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


మోజెస్ మృతదేహం

దౌల్తాబాద్(దుబ్బాక): ఓ యువకుడు చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఉప్పరపల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు. దౌల్తాబాద్ మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన సతీష్‌గౌడ్(20) పాల కేంద్రం నడుపుతూ పొలం పనులు చేస్తుంటాడు. రోజుమాదిరిగా బుధవారం సాయంత్రం పొలం వద్దకు వెళ్లిన సతీశ్ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పొలం వద్ద వెళ్లి చూడగా ఉరి వేసుకొని మృతిచెంది ఉన్నాడు. కాగా గతంలో ఆన్‌లైన్ గేమ్‌లు ఆడి నష్టపోవడంతోనే మృతిచెంది ఉండవచ్చని గ్రామస్తులు తెలిపారు.


సతీష్‌గౌడ్ (ఫైల్)

కరెంట్ షాక్‌తో మహిళ మృతి

జహీరాబాద్ టౌన్: మండలంలోని హోతి(బి) గ్రామంలో కరెంట్ షాక్‌తో ఓ మహిళ మృతి చెందింది. జహీరాబాద్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన జోగు రత్నమ్మ(65) ఇంటిపై నుంచి కరెంట్ తీగలు వెళ్లాయి. బుధవారం ఇంటిపై ఉన్న ఇనుప రాడ్‌ను తీసే క్రమంలో కరెంట్ తీగలకు తగిలింది. దీంతో కరెంట్ షాక్ తగిలి ఆమె పడిపోయింది. వెంటనే కుటుంబ సభ్యులు జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, టీఎస్ఐడీసీ చైర్మన్ తన్వీర్, ఇప్పెపల్లి సొసైటీ చైర్మన్ మచ్చేందర్‌లు ఆస్పత్రికి వెళ్లారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ప్రమాదకరంగా ఉన్న కరెంట్ తీగలను సరిచేయాలని ట్రాన్స్‌కో అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ మేరకు జహీరాబాద్ టౌన్ ఎస్ఐ శ్రీకాంత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


రత్నమ్మ(ఫైల్)